క్లుప్తంగా

నేడు నూతన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



సంకల్ప పూజలో పాల్గొన్న భక్తులు, దంపతులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ఉదయం 6.55 గంటలకు నూతన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం నిర్వహించనున్నట్టు గ్రామ సర్పంచ్ వల్లు వెంకట రమణ తెలిపారు. సంకల్ప పూజల్లో భాగంగా రెండో రోజు బుధవారం నూతన విగ్రహాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు గంగాధరభట్ల విష్ణుశర్మ, అప్పారావు శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. సర్పంచ్ వెంకట రమణ మాట్లాడుతూ టీటీడీ నిధులు రూ.10 లక్షలు, భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టారన్నారు. 9 మంది దంపతుల జంటలు పూజల్లో యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. అలాగే విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని కాటవరం, జాలిమూడి గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. 33/11 కేవీ కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్తగా 11 కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనుల కారణంగా విద్యుత్ ఆపివేస్తామన్నారు. దీనితో కాటవరం, జాలిమూడి గ్రామాలకు గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. గత రెండు రోజులుగా పనులు జరుగుతున్నాయని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్డీవో కృష్ణ నాయక్ పర్యటన



పందలపాకలో బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

బిక్కవోలు: ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ బుధవారం బిక్కవోలు మండలంలో పర్యటించారు. ముందుగా పందలపాక గ్రామంలోని వెంకటేశ్వర ఫైర్ వర్క్స్‌ను పరిశీలించారు. ఆ సంస్థ లైసెన్సు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవడంతో నిబంధన ప్రకారం ఉన్నాయా, లేవా అని పరిశీలించారు. బలభద్రపురంలోని గ్రాసిం ఇండస్ట్రీయల్ సల్ఫర్ రెన్యూవల్ దరఖాస్తు చేసుకోవడంతో అక్కడకు వెళ్లారు. ఆయన వెంట తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలు బీమా చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: ఉపాధి హామీ కూలీలకు అమలు చేస్తున్న సౌకర్యాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమాకు రూ.20 బ్యాంకులో చెల్లించినట్లయితే, వారికి ప్రమాద బీమాగా రూ.2 లక్షలు అందజేస్తారన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి స్కీమ్‌లో ఏడాదికి రూ.460 చెల్లిస్తే ప్రమాదవశాత్తు, సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు వారి కుటుంబాలకు పరిహారం అందజేస్తారన్నారన్నారు.

'షేటర్‌తో సీఎమ్' పోస్టింగ్‌పై కేసు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన ఓబిలినేని కృష్ణ చైతన్య సామాజిక మాధ్యమాల్లో 'షేటర్‌తో సీఎమ్' అనే పేరుతో పోస్టింగ్ పెట్టినట్లు సీతానగరానికి చెందిన బూలా రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం మాట్లాడతూ వంగలపూడికి చెందిన గద్దె నాని అలియాస్ జ్ఞానేంద్ర ప్రసాద్..ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉన్న ఫోటోను ముగ్గళ్లకు చెందిన కృష్ణ చైతన్య సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్ చేశాడు. దానికి 'షేటర్‌తో సీఎమ్' అనే పేరు పెట్టాడు. ఇది ముఖ్యమంత్రి ప్రతిష్ఠను అగౌరవపరుస్తున్నట్లు ఉందని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసత్య ప్రచారంపై..

ముగ్గళ్లకు చెందిన పెనుగుల రవి కుమార్ ఫిర్యాదు మేరకు మింగి లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. లక్ష్మీనారాయణ సోషల్ మీడియాలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటర రమణ చౌదరిని అగౌరవపరుస్తున్నట్లు, టీడీపీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టింగ్‌లు పెడుతున్నారని రవి కుమార్ ఫిర్యాదు చేశాడన్నారు.

కిశోర వికాసం

- జూన్ 10 వరకూ కార్యక్రమాలు
- కిశోర బాలికలకు అవగాహన
- అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

మధురపూడి: కిశోర బాలికలతోనే సమాజ వికాసం సాధ్యమవుతుంది. దీని కోసమే రేపటితరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ ఆహారం అందజేస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో కిశోర బాలకలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మే రెండున ప్రారంభమైన ఈ కార్యక్రమాలు జూన్ 10వ తేదీ వరకూ జరుగుతాయి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో వీటిని నిర్వహిస్తున్నారు.

అవగాహన

కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ వివక్షత నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికల అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రతను తెలియజేస్తున్నారు. గ్రామ మహిళా పోలీసు కన్వీనర్‌గా అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, ఎంపీహెచ్‌వోడబ్ల్యూ, వీఓఏలు సభ్యులుగా కూడిన కమిటీ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

228 అంగన్‌వాడీ కేంద్రాలు

కోరుకొండ సీడీపీవో పరిధిలోని కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 228 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 11,133 మంది చిన్నారులు, 1,133 మంది గర్భిణులు, 1,331 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఐసీడీఎస్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, మార్చిలో పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహిస్తారు. దానిలో భాగంగా చిన్నారులు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలకు మంచి ఆరోగ్యం కోసం అవగాహన కల్పిస్తారు.



శ్రీరంగపట్నంలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో వరలక్ష్మి

చిరుధాన్యాలతో ఆరోగ్యం

రాగులు, జొన్నలు, కొర్రలు తదితర చిరుధాన్యాలలో పోషక విలువలు చాలా ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. అలాగే ఆకుకూరలతో రక్తహీనత ఉండదు.

పౌష్టికాహారం అందజేత



కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమాలతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. కోరుకొండ సీడీపీవో పరిధిలో 228 అంగన్‌వాడీ సమావేశాలు జరిపాం. ఈ కేంద్రాల ద్వారా 11,133 మంది చిన్నారులు, 1,133 మంది గర్భిణులు, 1,331 మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

– పి.వరలక్ష్మి, సీడీపీఓ, ఐసీడీఎస్ కోరుకొండ

రక్తహీనత



వ్యవసాయ కూలీలుగా, తాపీ కార్మికులుగా పనిచేస్తున్న మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోంది. వీరికి పోషణ కిట్లు చాలా అవసరం, గర్భిణులు, బాలింతలు అందరికీ అందించడానికి కృషి చేయాలి. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది.

– ముదే సింధూదివ్య, సర్పంచ్, కోటికేశవరం

ఉపాధి కూలీలకు వేతన బకాయిల చెల్లింపు

- రూ.1.20 కోట్ల మేర అందజేత
- సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)లో మండలంలో పనులు చేస్తున్న కూలీలకు రూ.1.20 కోట్ల మేరకు వేతన బకాయిలు చెల్లించామని ఎంపీడీఓ జేపీ రూఫస్ తెలిపారు. నెలల తరబడి వేతనాలు అందక కూలీలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను 'ఉపాధి కూలీల ఆకలి కేకలు' అనే శీర్షికన గత నెల 21న సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రస్తుతం మూడు నెలలకు బకాయిలు చెల్లించారు. మండలంలో 15 వేల వరకు జాబ్‌కార్డులు ఉంటే వాటిలో 10 వేల వరకు యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. వీటి నుంచి ప్రతి రోజు ఆరు వేల మంది వరకు వివిధ చోట్ల పనులు చేస్తున్నారన్నారు. వీరికి గత జనవరి నుంచి వేతనాలు మంజూరు కాకపోవడం వలన చెల్లింపులు జరుగలేదన్నారు. తాజాగా నిధులు మంజూరు కావడంతో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలాఖరు వరకు బకాయిలు చెల్లించామన్నారు.

బీమా చేయించుకోవాలి




జేపీ రూఫస్, ఎంపీడీఓ, రాజానగరం

ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఇటీవల గోపాలపురంలో జరిగిన ఒక ప్రమాదంలో మరణించిన వ్యక్తి బీమా తీసుకోకపోవడం వలన ఆ కుటుంబానికి ఎటువంటి పరిహారాన్ని అందించలేకపోయారని గుర్తు చేశారు. ఈ కారణంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి కూలీ పీఎంజెవైలో పేరు నమోదుచేసుకుని, బీమా చేసుకోవాలన్నారు. ఇందుకుగాను సంవత్సరానికి ప్రీమియంగా రూ.20 చెల్లిస్తే సరిపోతుందన్నారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసులోపు వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా అందుతుందన్నారు. అదే 18 ఏళ్ల నుంచి ఏళ్ల వయసున్న వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే సహజ మరణానికి కూడీ ఈ బీమా వర్తిస్తుందని వివరించారు.

14 రోజుల పాటు ఎమ్మెల్యే ఏమయ్యారో..

- ఎట్టకేలకు దోమాడ బాధితుల వద్దకు..
- ఇది వైఎస్సార్ సీపీ, దళిత, ప్రజా సంఘాలు, బాధితుల విజయం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితుల వైపు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 14 రోజులుగా కన్నెత్తి చూడలేదని, అయితే ఎట్టకేలకు ఆయనను బాధితుల దీక్ష శిబిరానికి రప్పించామని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇది వైఎస్సార్ సీపీ, వివిధ ప్రజా, దళిత సంఘాలు, బాధితుల ఘన విజయమన్నారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధితులు ఇళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 14 రోజులుగా వారిని ఎందుకు పరామర్శించలేదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని ప్రశ్నించారు. ఓట్లు వేసి గెలిపించిన పాపానికి ఇళ్లు కూల్చి వేయించారని ఆరోపించారు. ఈ సంఘటనపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బాధితులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారన్నారు. దానిపై కలెక్టర్ బాధితులకు ఏ విధంగా న్యాయం చేయాలో రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి వేణుతో మాట్లాడారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దిక్కు తోచని స్థితిలో కలెక్టర్ ప్రకటనను లబ్ధిదారులకు చెప్పడానికి వెళ్లారంటూ ఎద్దేవా చేశారు. బాధితులను 14 రోజుల పాటు పరామర్శించకుండా కాకినాడ, భీమవరం, పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారన్నారు. పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అనపర్తి నుంచి పది కార్లు వేసుకుని వచ్చారని, ఆ సమయంలో 20 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. బాధితుల దీక్ష శిబిరానికి పోలీసులను వెంటబెట్టుకుని వెళ్లారంటూ విమర్శించారు. బాధితులు కూడా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై మండిపడ్డారన్నారు. తెల్లవారుజామున 5 గంటలకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ, వంద మంది పోలీసులు వెళ్లి ఇళ్లు కూల్చివేయడం స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా చేస్తారా అని ప్రశ్నించారు. బాధితులకు రూ.6 లక్షల చొప్పున నష్టపరిహారం లేఅవుట్ యజమాని నుంచి ఇప్పిస్తారో, లేక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీసుకున్నారంటున్న మాముళ్ల నుంచి ఇప్పిస్తారో తక్షణం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

ఘనంగా వాసవీ మాత జయంత్యుత్సవం



పెదపూడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పెదపూడి: వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం పెదపూడిలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. జనార్దనస్వామి ఆలయంలోని వాసవీ మాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో భక్తులు, ఆ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ మాత్ర జయంతి వైభవంగా జరిగింది. గ్రామంలోని రావుల చెరువు గట్టున ఉన్న వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



రాజానగరంలో అమ్మవారి పల్లకీ ఉత్సవం

అనంతరం గ్రామంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

బీసీ సంక్షేమం పేరిట అడ్డగోలు అవినీతి



అనపర్తిలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కొండేటి భీమేష్

పెదపూడి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించిన బీసీ మహిళలకు కుట్టుమెషీన్ శిక్షణ తరగతులు, కుట్టుమెషీన్ పంపిణీ టెండర్లలో తీవ్ర అవినీతి జరిగిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కొండేటి భీమేష్ ఆరోపించారు. అనపర్తిలో కుట్టుమెషీన్ల పంపిణీ వ్యవహారంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని, ఎంపీడీఓకు బుధవారం వినతి పత్రంఅందజేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపు ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.23 వేలు కేటాయించారన్నారు. వాస్తవంగా కుట్టు మెషీన్ తో పాటు శిక్షణకు వ్యయం రూ.7,300 మాత్రమే అవుతుందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.23 వేలను ఒక్కొక్క లబ్ధిదారుడికి వ్యయం అయ్యిందని చూపిస్తూ దాదాపు రూ.167 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ టెండర్ల అవినీతిపై ప్రజలకు తెలియజేయాలని వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, బీసీ నాయకులు కానూరి కృష్ణారావు, చిట్టూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

చల్లా సత్యవాణి సేవలు అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తోట సుబ్బారావు తదితరులు

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక రచన చేస్తూ, ఉచితంగా పుస్తక వితరణ చేస్తున్న డాక్టర్ మేజర్ చల్లా సత్యవాణి సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆమె రచించిన సరస్వతీ నది పుష్కర క్షేత్ర దర్శిని పుస్తకావిష్కరణ సభ బుధవారం స్థానిక సరస్వతీ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. పుస్తకాన్ని ఆలయ వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు ఆవిష్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ సరస్వతీ నది గురించి పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. డాక్టర్ సత్యవేణి 40 పుస్తకాలు రచించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ కాసా జయప్రద పాల్గొన్నారు.

సుందర నగరంగా రాజమహేంద్రవరం

- కలెక్టర్ ప్రశాంతి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ: పుష్కరాల పనుల్లో భాగంగా రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రూ.8 కోట్లతో చేపట్టే రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రొమినేడ్ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్యాలరీలో నమూనా ఫోటోలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో రోజూ సుమారు 10 లక్షల మంది ఈ ప్రాంతానికి వస్తారనే అంచనా వేస్తున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద కేంద్ర పర్యాటక శాఖ ద్వారా రూ. 100 కోట్ల నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులలో రూ.97 కోట్లు ఒక్క రాజమహేంద్రవరానికే కేటాయించగా పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వెల్లడించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



కోరుకొండలో సీతారామరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

కోరుకొండ: స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ప్రదీప్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని బ్రిటీషు సామ్రాజ్యవాదులను అల్లూరి గడగడలాడించారన్నారు. ఆయన స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ, అమిత్‌షా సర్కార్ పాసిస్టు పాలన సాగిస్తోందన్నారు. విప్లవకారులు, నక్సలైట్లను అంతమొందించాలన్న ఉద్దేశంతో నరమేధం సృష్టిస్తోందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ద్వారా పేదవర్గాలకు ఒరిగేదేమీ ఉండదన్నారు. ముందుగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాలెపు రామారావు, జగన్నాథం నాగన్న, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్ బుధవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేతలు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి ఘనంగా స్వాగతం పలికారు. కడియం ప్రాంత నర్సరీ రైతులు ఎంతో నైపుణ్యంతో అభివృద్ధి చేస్తున్న సరికొత్త మొక్కల గురించి డీజీకి నర్సరీ రైతు పల్ల వినయ్ వివరించారు. డీజీ వెంట జైళ్లశాఖ ఉన్నతాధికారులు ఎంఆర్ రవికిరణ్, ఎస్.రాహుల్, ఎం.రాజ్‌కుమార్, పర్యావరణమిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట: పదో తరగతిలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ ప్రశాంతి బుధవారం ఘనంగా సత్కరించారు. వడిశలేరుకు చెందిన ఆత్కూరి లక్ష్మీ ప్రియాంకర్ (583 మార్కులు), రంగంపేట హైస్కూల్‌కు చెందిన కొౌట్టి శ్యామ్‌కుమార్ (581 మార్కులు) అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు అరుణ, పార్థసారథి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ పదవికి సబ్బెళ్ల కృష్ణారెడ్డి రాజీనామా



పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓకు రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరినట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల్లో రాజ్యాంగేతర పాలన, ప్రొటోకాల్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు జరుగుతున్న అవమానాలు, ప్రలోభాలను నిరసిస్తూ తాను ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశానన్నారు. 13వ వార్డు పాలక మండల సభ్యుడిగా కొనసాగనున్నట్లు తెలిపారు. మూడు పర్యాయాలుగా గ్రామ ఉప సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశానన్నారు. తనకు అవకాశం కల్పించిన ప్రజలకు, నాయకులకు, పంచాయతీ పాలకమండలి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

బాల వికాస్ తరగతులకు హాజరుకావాలి



కోటపాడులో ఈశ్వరాంబ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న సభ్యులు

రంగంపేట: సత్యసాయి బాలవికాస్ తరగతులకు ప్రతి వారం విధిగా హాజరుకావాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ కోరారు. కోటపాడులో నిర్వహించిన సత్యసాయి బాలవికాస్ వారోత్సవాలు, సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరాంబ వర్ధంతి వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. అనంతరం బాలవికాస్ గురువు కందర్ప భానుమతి ఆధ్వర్యంలో విద్యార్థులు.. ఈశ్వరాంబ చిత్ర పటానికి, బాబా పాదులకు సామూహిక పూజలు చేశారు. ఈశ్వరాంబ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో కందర్ప శ్రీరామ్మూర్తి శర్మ, పోతుల శంకరరావు పాల్గొన్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

కోరుకొండ: వ్యసనాలకు, దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఎస్సై కూనా నాగరాజు సూచించారు. ఈ మేరకు బుచ్చెంపేట, గుమ్ములూరు గ్రామాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం, సారా, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

23 మంది అరెస్ట్

కోరుకొండ మండలంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న 23 మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామని, గురువారం కోర్టులో హాజరు పర్చుతామన్నారు.

సారా తయారీదారుడి అరెస్ట్

రంగంపేట: సారా తయారీదారుడిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ దొడ్డిగుంట గ్రామంలో దాడులు నిర్వహించి, గార్లంకల సత్తిబాబును అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి 240 కేజీల బెల్లం, బైకు స్వాధీనం చేసుకున్నామని, వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే సారా తయారు చేస్తున్న చొల్లంగి వీరబాబుపై కేసు నమోదు చేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట శివారున పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. వారి నుంచి రూ. 8,270 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు. మండల గ్రామాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రకాశం నగర్: మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె నోటీసును బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ షబ్నం అప్సర్‌కు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా కార్యదర్శి బి. పూర్ణిమరాజు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కార్మిక హక్కుల హరించే లేబర్ కోడ్స్ రద్దు కోసం జరిగే ఈ సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ రంగంలో కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున దోపిడీకి గురవుతున్నారన్నారు.